https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 23 ఆదివారం 17-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505285656.

## భారత్‌కు నాలుగు కీలక లక్ష్యాలు: మోదీ

**ఒలింపిక్స్ నిర్వహణపై ప్రత్యేక ఆకాంక్ష**

**ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలి**

**సాంకేతిక రంగంలో వేగంగా పురోగతి**



**న్యూఢిల్లీ మే 16**

భారత దేశ భవిష్యత్తు అభివృద్ధి, ప్రపంచ స్థాయిలో మరింత బలమైన స్థానాన్ని సంపాదించాలనే లక్ష్యంతో దేశానికి నాలుగు అతిపెద్ద ఆకాంక్షలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరంలో భారతీయులతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దేశ ప్రగతి, ఆర్థిక లక్ష్యాలు, సాంకేతిక అభివృద్ధి, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం వంటి అనేక కీలక అంశాలపై విస్తృతంగా మాట్లాడారు. భారతీయుల ఆశయాలు అపరిమితమని, వాటిని సాధించేందుకు దేశం కూడా అదే స్థాయిలో కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశలు, యువత కలలు, సాంకేతిక అభివృద్ధి, ఆర్థిక ప్రగతి అన్నీ కలిసి భారత భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. ప్రపం చంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలవాలంటే పెద్ద లక్ష్యాలు అవసరమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా దేశానికి ఉన్న నాలుగు ప్రధాన లక్ష్యాలను ప్రధాని వివరించారు. భారతదేశంలో ఒలింపిక్ క్రీడలను నిర్వహించడం మొదటి లక్ష్యమని తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడా వేదికలను దేశంలో ఏర్పాటు చేసి అంతర్జాతీయ క్రీడలకు కేంద్రంగా భారత్ ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడా రంగంలో యువత ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు రెండో లక్ష్యంగా ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దడమేనని ప్రధాని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా తయారీ రంగంలో భారత్ ప్రధాన పాత్ర పోషించే దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, కొత్త సాంకేతికతల వినియోగం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందన్నారు. మూడో లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ రంగంలో ప్రపంచానికి మార్గదర్శక దేశంగా భారత్ ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు మోదీ తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై దేశం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. సౌరశక్తి, పవనశక్తి, హరిత విద్యుత్ ఉత్పత్తి వంటి రంగాల్లో భారత్ ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధిం చిందని పేర్కొన్నారు. నాలుగో ప్రధాన లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ ఎదగాలని ప్రధాని వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే దేశంగా భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు.

# జైలుకు బండి భగీరథ్

**టీజీపీఏ వద్ద అరెస్టు చేశామన్న పోలీసులు.. పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు తరలింపు**

**డీసీపీ ఆధ్వర్యంలో రెండున్నర గంటలపాటు విచారణ**

**వైద్య పరీక్షల అనంతరం మెజిస్ట్రేట్ ఎదుట హాజరు**

**14 రోజుల రిమాండ్.. చర్లపల్లి జైలుకు తరలింపు**

**ఉదయం నుంచే 'ఆపరేషన్ భగీరథ్' పేరిట వేట**

**లుకౌట్ నోటీసు జారీ.. విమానాశ్రయాల్లో అప్రమత్తం**

**భగీరథ్ బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంట్లో గాలింపు**

**సంజయ్ బంధువులు, భగీరథ్ స్నేహితులను స్టేషన్‌కు పిలిపించి విచారించిన పోలీసులు**



**హైదరాబాద్, మే 16**

పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. నార్సింగి పరిధిలోని టీఎస్‌పీఏ వద్ద రాత్రి 8:15 గంటలకు భగీరథ్‌ను అరెస్టు చేసినట్లు, విచారణ నిమిత్తం ఎస్‌వోటీ పోలీసుల బృందం అతణ్ని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం.రమేష్ తెలిపారు. శనివారం రాత్రి 9:05 గంటలకు బండి భగీరథ్ ముఖానికి మాస్కు, తెల్లని హుడీ ధరించి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. మఫ్టీలో ఉన్న పోలీసుల సమక్షంలో నాలుగు వాహనాల్లో ఐదుగురు న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట హాజరయ్యాడు. భగీరథ్ వచ్చిన ఐదు నిమిషాలకు విచారణాధికారి, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. రెండున్నర గంటలపాటు భగీరథ్‌ను విచారించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి.. అర్ధరాత్రి మేడ్చల్ జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలను, పోలీసుల రిపోర్టును పరిశీలించిన మెజిస్ట్రేట్ భగీరథ్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం పోలీసులు అతణ్ని చర్లపల్లి జైలుకు తరలించారు. దీంతో శనివారం ఉదయం నుంచి బండి భగీరథ్ అరెస్టుపై నెలకొన్న ఉత్కంఠ వీడింది. తొలుత తానే స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోతానన్న సంకేతాలు భగీరథ్ నుంచి పోలీసు వర్గాలకు అందినట్లు తెలిసింది. ఇందుకు తగ్గట్లుగానే ఉదయం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, రెట్టింపు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అయితే అనూహ్య రీతిలో పోలీసులే అతణ్ని అరెస్టు చేశారు. బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోతున్నాడని శనివారం ఉదయం నుంచి ప్రచారం జరిగింది. దాంతో పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పోలీసులు ముందుగానే రోడ్డుపై ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పీఎస్ ఎదుట బారికేడ్లు ఏర్పాటు చేశారు. భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోతే పంచనామా నిర్వహించగానికిగాను కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయం రికార్డు అసిస్టెంట్ బాలప్రసాద్, వీఆర్‌ఏ.. మధ్యాహ్నం నుంచి పోలీస్‌స్టేషన్ వద్దే వేచి ఉన్నారు. వీరితోపాటు.. భగీరథ్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచడానికి తీసుకెళ్లే ముందు వైద్య పరీక్షలు నిర్వహించడానికిగాను ఇద్దరు ప్రభుత్వ వైద్యులు రాత్రి 8:00 గంటలకు (భగీరథ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడానికి అరగంట ముందే) వచ్చినట్లు తెలిసింది. మరోవైపు సాయంత్రం 6:30 నుంచి పోలీస్‌స్టేషన్ గేట్లు మూసివేశారు. మీడియాను లోపలికి అనుమతించలేదు. మొత్తమ్మీద శనివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు పోలీస్‌స్టేషన్ వద్ద మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో వేచి ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాత్రి 9:05 గంటలకు మేడ్చల్ రోడ్డు మార్గం గుండా భగీరథ్ పీఎస్‌కు చేరుకున్నారు.

**రెండున్నర గంటలపాటు విచారణ..**

శనివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బండి భగీరథ్‌ను విచారణ పర్యవేక్షణాధికారి రితిరాజ్ బృందం రెండున్నర గంటలపాటు విచారించారు. "పోక్సో కేసు బాధితురాలు ఎంతకాలంగా పరిచయం? ఎలా పరిచయం? మీ మధ్య ఎలాంటి స్నేహం ఉంది? బాధితురాలిపై అత్యాచారానికి పాల్పడ్డారా? ఆమె మైనర్ అని తెలియదా? ఘటనా స్థలంలో అసలేం జరిగింది? బాధితురాలు సమర్పించిన ఆధారాలకు మీ సమాధానమేంటి? కేసు నమోదైన విషయం తెలిసిన తర్వాత చట్టానికి దొరక్కుండా ఎందుకు తప్పించుకున్నారు?" అంటూ పోలీసులు భగీరథ్‌పై ప్రశ్నల వర్షం కురిపించి సమాధానాలు రాబట్టడంతోపాటు అతని స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. డీసీపీ రితిరాజ్ వెంట ఎస్‌వోటీ డీసీపీ శోభన్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌వర్ధన్ ఇతర పోలీస్ బృందం ఉన్నారు. కాగా, నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి మేడ్చల్ జిల్లా మెజిస్ట్రేట్ ఇంటి వద్ద హాజరుపరిచారు. అయితే, భగీరథ్ న్యాయపోరాటం చేస్తున్నాడని అతని తరపు న్యాయవాది కరుణాసాగర్ అన్నారు. అతను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. తామే భగీరథ్‌ను ఎస్‌ఓటీ పోలీసులకు అప్పగించామని, వారు పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించారని తెలిపారు. పూర్తి విచారణకు సహకరిస్తామన్నారు. త్వరలోనే బెయిల్ పిటిషన్ వేస్తామని, భగీరథ్‌ను నిర్దోషిగా బయటకు తీసుకువస్తామని చెప్పారు. బండి భగీరథ్ పోలీసు విచారణకు హాజరు కాకపోవడం, అతనికి ముందస్తు బెయిల్ విషయంలో ఎలాంటి రక్షణ కల్పించని విధంగా శుక్రవారం హైకోర్టులో ఆదేశాలు రావడంతో శనివారం తెల్లవారుజాము నుంచే పోలీసులు అతని కోసం వేట ముమ్మరం చేశారు. ఆపరేషన్ భగీరథ్ పేరిట అతణ్ని పట్టుకోవడం కోసం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సైబరాబాద్ స్పెషల్ టీమ్స్ శనివారం ఉదయం నుంచి తీవ్ర స్థాయిలో గాలింపు చేపట్టాయి. హైదరాబాద్, ఢిల్లీ, కరీంనగర్, పుణె, బెంగళూరులో 14 పోలీసు బృందాలు భగీరథ్ కోసం రంగంలోకి దిగాయి.

## వాణిజ్య శాఖలకు ఒకే సమగ్ర కేంద్రం

**ముంబైలో కొత్త కార్యాచరణ దిశ**

**నలభై ఆరు సంస్థలకు ఒకే వేదిక**

**ఎగుమతుల లక్ష్యంపై కేంద్రం దృష్టి**



**ముంబై, మే 16**

దేశ వాణిజ్య, పరిశ్రమల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుడుతోంది. ముంబైలో వాణిజ్య, పరిశ్రమలకు సంబంధించిన అన్ని కార్యాలయాలను ఒకే సమగ్ర కేంద్రం కింద తీసుకురావాలనే దూరదృష్టి ప్రణాళికను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, సమయం ఆదా చేయడం, వ్యయాలను తగ్గించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రతిపాదన ప్రకారం ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్న మొత్తం నలభై ఆరు సంస్థలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానం ద్వారా పరిపాలనా వ్యవస్థ మరింత సులభతరం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకే కేంద్రంలో కార్యాలయాలు ఉండటం వల్ల సంస్థల మధ్య సమన్వయం పెరుగుతుందని, పనుల నిర్వహణ వేగవంతం అవుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అధికారుల మధ్య పరస్పర సంబంధాలు మెరుగుపడటంతో నిర్ణయ ప్రక్రియ కూడా సులభతరం అవుతుందని అభిప్రాయపడ్డారు. పరిపాలనా వ్యయాలను తగ్గించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారుతుందని తెలిపారు. వేర్వేరు కార్యాలయాల నిర్వహణకు అయ్యే ఖర్చులు తగ్గడంతో పాటు ప్రభుత్వానికి కూడా గణనీయమైన ఆదా కలుగుతుందని వెల్లడించారు. ప్రజలకు కూడా ఈ విధానం ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి వివరించారు. వేర్వేరు ప్రాంతాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గిపోవడంతో సమయం, ఇంధనం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు ఒకే ప్రాంతంలో అందుబాటులోకి రావడం ద్వారా సౌలభ్యం పెరుగుతుందని తెలిపారు. ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ నిర్ణయం తోడ్పడుతుందని పేర్కొన్నారు. నగరాల్లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం కూడా ఉందని అభిప్రాయపడ్డారు. దేశ ఎగుమతుల లక్ష్యాలను సాధించడంలో కూడా ఈ ప్రణాళిక కీలక పాత్ర పోషించనుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు రెండు వేల ముప్పై నాటికి రెండు లక్షల కోట్ల డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని సాధించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. దేశ వాణిజ్య రంగాన్ని మరింత పోటీతత్వంతో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని పీయూష్ గోయల్ తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

# తైవాన్ కోసం చైనాతో యుద్ధం చేయలేం!

**15 వేల కిలోమీటర్లు వెళ్లి శక్తిమంతమైన దేశంతో తలపడలేం..**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన**

**వాషింగ్టన్, మే 16:**

చైనా-తైవాన్ వివాదంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తైవాన్ కోసం 15 వేల కిలోమీటర్లు వెళ్లి చైనాతో యుద్ధం చేయలేమని పేర్కొన్నారు. ఈ విషయంలో పరిస్థితులన్నీ చైనాకే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. చైనాలో రెండురోజుల పర్యటన ముగించుకొని అమెరికా చేరుకొన్న ఆయన.. శుక్రవారం (స్థానిక కాలమానం) ఫాక్స్‌న్యూస్ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'తైవాన్ అంశం చాలా క్లిష్టమైనది. చైనా చాలా శక్తిమంతమై, పెద్ద దేశం. తైవాన్ చాలా చిన్న ద్వీపం. అది చైనాకు 150 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. మేము 15 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. అదే అసలు సమస్య. ఒకదేశ స్వాతంత్ర్యం కోసం 15 వేల కిలోమీటర్లు వెళ్లి ఒక శక్తిమంతమైన దేశంతో యుద్ధం చేయలేం. చైనా, తైనాన్‌లు సంయమనంతో వ్యవహరించాలి' అని సూచించారు. చైనా పర్యటనలో ఆ దేశ నేతలతో తాను జరిపిన చర్చల్లో ఎక్కువ సమయం తైవాన్‌పైనే గడిచిందని తెలిపారు. అయితే, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చలు జరిపిన తర్వాత కూడా తైవాన్ విషయంలో అమెరికా వైఖరి ఏమీ మారలేదని ట్రంప్ పేర్కొన్నారు. 'నేను అమెరికా అధ్యక్షుడిగా ఉన్నంతకాలం తైవాన్‌పై చైనా దాడి చేయకపోవచ్చు. నేను ఇక్కడ లేకపోతే.. దాడి జరగొచ్చు' అని పేర్కొన్నారు. జిన్‌పింగ్‌తో సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిపారు. 'అమెరికా-చైనా గొప్ప దేశాలు (జీ-2)' అని వ్యాఖ్యానించారు. గత అమెరికా అధ్యక్షుల తప్పుడు విధానాల వల్లే చిన్న ద్వీపమైన తైవాన్ నేడు చిప్‌ల తయారీకి హబ్‌గా మారిందని ట్రంప్ విమర్శించారు. అమెరికా చిప్‌ల పరిశ్రమను తైవాన్ దొంగిలించిందన్నారు. రెండు రోజుల చైనా పర్యటనలో ట్రంప్‌కు ఆతిథ్య దేశం ఇచ్చిన బహుమతులన్నీ అక్కడే చెత్తబుట్టలో వేసి స్వదేశానికి వెళ్లారు. ట్రంప్‌తోపాటు ఆయన అనుచర గణానికి, ఆయనతోపాటు వెళ్లిన అమెరికా పారిశ్రామిక దిగ్గజాలకు చైనా అధికారులు అందించిన బహుమతులు, గుర్తింపు కార్డులు, ఇతర వస్తువులన్నీ ట్రంప్ అధికారిక విమానం ఎయిర్‌ఫోర్స్ వన్ వద్ద ఏర్పాటుచేసిన చెత్తబుట్టలో పడేసినట్లు న్యూయార్క్ పోస్ట్ వార్తా సంస్థకు చెందిన



వైట్‌హౌస్ ప్రతినిధి ఎమిలీ గూడిన్ తెలిపారు. 'చైనా అధికారులు ఇచ్చిన ప్రతి వస్తువును అమెరికా సిబ్బంది మా నుంచి తీసేసుకున్నారు. విమానాశ్రయంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం పక్కన ఉన్న చెత్తబుట్టలో వాటిని పడేశారు. ఆ వస్తువుల్లో చైనా గూఢచర్యం, హ్యాకింగ్‌కు సంబంధించిన డివైస్?లు అమర్చి ఉంటుందన్న అనుమానంతోనే ఇలా చేశారు' అని ఎమిలీ ట్వీట్ చేశారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ ఈసారి బహిరంగంగానే చైనా వస్తువులను చెత్తబుట్టలో వేసినట్లు తెలిపారు.

## గ్రీన్ గాంధీనగర్ లక్ష్యంపై అమిత్ షా సమీక్ష

**వృక్షారోపణ పనులపై సమీక్ష సమావేశం**

**మూడేళ్లలో భారీగా మొక్కల నాటకం**

**చెరువుల అనుసంధానంపై విస్తృత చర్చ**



**గాంధీనగర్, మే 16**

గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో వృక్షారోపణ, చెరువుల పునరుద్ధరణ కార్యక్ర మాలు కొత్త గుర్తింపుగా మారాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా నిరంతరంగా చేపడుతున్న పర్యావరణ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. 'గ్రీన్ లోక్‌సభ - గాంధీనగర్ లోక్‌సభ' సంకల్పంలో భాగంగా కొనసాగుతున్న వృక్షారోపణ కార్యక్రమాలపై అమిత్ షా సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో చేపడుతున్న చర్యల పురోగతిని అధికారులతో చర్చించారు. గత మూడు సంవత్సరాల్లో గాంధీనగర్ లోక్‌సభ పరిధిలో సుమారు ఒకటిన్నర కోట్ల మొక్కలు నాటినట్లు ఆయన వెల్లడించారు. విస్తృత స్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమాల కారణంగా నియోజకవర్గ సగటు ఉష్ణోగ్రతలో రెండు నుంచి మూడు డిగ్రీల వరకు తగ్గుదల నమోదైందని పేర్కొన్నారు.

# తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై కీలక పత్రికా సమావేశం

**అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం**

**సర్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా,కచ్చితత్వంతో సిద్ధం చేయడం**







**అంబర్‌పేట,మే 16:**
తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, ఐఏఎస్ అధికారి అయిన శ్రీ సి. సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో ప్రత్యేక విస్తృత పునర్విమర్శ పై మీడియాతో ప్రసంగిస్తూ, SIR పక్రియను సవివరంగా వివరించారు. ఈరోజు, అనగా 16/05/2026న, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు మరియు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులతో (ఈఆర్ఓలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో, సీఈఓ జిల్లా ఎన్నికల అధికారులకు (డీఈఓలకు) ఎస్ఐఆర్ షెడ్యూల్ గురించి వివరించి, ఈ మొత్తం ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడానికి ఒక వ్యూహాన్ని సిద్ధం చేయాలని వారికి సూచించారు. ఈ కార్యకలాపాలలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఎన్యూమరేషన్ ఫారాలను (ఈఎఫ్) పూరించడం మరియు ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించడం వంటివి ఉన్నాయి.రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని మరియు బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని కూడా సీఈఓ డీఈఓలకు సూచించారు. సమావేశాల మినిట్స్‌ను సరిగ్గా నమోదు చేయాలి.అంతేకాకుండా, ఎస్ఐఆర్ ప్రక్రియ మరియు ఈసీఐ నెట్ మొబైల్ అప్లికేషన్‌పై బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు మరియు టెక్నికల్ టీమ్‌కు శిక్షణ ఇవ్వడానికి సంబంధించి కూడా సూచనలు జారీ చేయబడ్డాయి. తమతమ జిల్లాల్లోని వీవీఐపీ ఓటర్లను సరిగ్గా గుర్తించి, గుర్తించాలని, అలాగే డీఈఓ మరియు ఈఆర్ఓ స్థాయిలలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఈఓ డీఈఓలు మరియు ఈఆర్ఓలందరినీ ఆదేశించారు.ఈ సమావేశంలో ఐఏఎస్ అధికారి, అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర రెడ్డి; ప్రభుత్వ అదనపు కార్యదర్శి శ్రీ శంకర్; సహాయ కార్యదర్శి ఎ.ఎస్. చారి; ఎస్‌జీడీసీకి చెందిన శ్రీ బి. చన్నయ్య; ఎస్‌జీడీసీకి చెందిన శ్రీమతి ఎన్. ప్రసూనాంబ,సంబంధిత నోడల్ అధికారులు మరియు పీఎం (ఐటీ) శ్రీ చిరంజీవి పాల్గొన్నారు.

## సిక్కిం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి హాజరు



**గ్యాంగ్‌టక్, మే 16**
సిక్కిం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ శనివారం గ్యాంగ్‌టక్‌కు చేరుకున్నారు. ఆయన రాక సందర్భంగా రాష్ట్ర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. గ్యాంగ్‌టక్‌లోని లోక్ భవన్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతికి సిక్కిం గవర్నర్ ఓం ప్రకాశ్ మాథూర్, ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్‌తో పాటు పలువురు ప్రముఖులు ఆత్మీయ స్వాగతం తెలిపారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా ప్రత్యేక గౌరవ వందనం నిర్వహించారు. రాష్ట్ర ప్రోటోకాల్ ప్రకారం ఆయనకు అధికారిక మర్యాదలు అందజేశారు. సిక్కిం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సాంస్కృతిక బృందాలు పాల్గొంటున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సిక్కిం సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉపరాష్ట్రపతి పాల్గొనడం ఈ వేడుకలకు మరింత ప్రాధాన్యతను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, జాతీయ ఐక్యత వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు సమాచారం.

## ప్రసాదం తిన్న 62 మంది అస్వస్థత..

**ఉత్తర ప్రదేశ్, మే 16:**
ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమం అనంతరం ప్రసాదం తిన్న భక్తులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవడంతో కలకలం రేగింది. ఈ ఘటన కన్నౌజ్ జిల్లాలోని సిమౌపూర్ గ్రామంలో శు క్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనలో మొత్తం 62 మంది వరకు అనారోగ్యానికి గురైనట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిమౌపూర్ గ్రామానికి చెందిన మున్నాలాల్ కశ్యప్ తన నివాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంధువులు, సన్నిహితులు, గ్రామస్థులను ఆహ్వానించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం హాజరైన వారికి భోజన ప్రసాదం పంపిణీ చేశారు.అయితే ప్రసాదం తీసుకున్న కొన్ని గంటలకే పలువురిలో అస్వస్థత లక్షణాలు కనిపించాయి. మొదట కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మొదలవగా ఆ తర్వాత కొందరి ఆరోగ్య పరిస్థితి మరింత బలహీనంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ప్రాథమికంగా బాధితులను సమీపంలోని ప్రైవేటు క్లినిక్‌లకు తరలించి చికిత్స అందించారు. అయితే ఒకేసారి పెద్ద సంఖ్యలో ఒకే రకమైన లక్షణాలు బయటపడటంతో పరిస్థితి తీవ్రతరమైందని భావించిన వైద్యులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొత్తం 62 మంది ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం. ప్రస్తుతం వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. బాధితుల పరిస్థితి స్థిరంగానే ఉందని, ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యాధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఘటనకు గల అసలు కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## గ్రేటర్ హైదరాబాద్ లో అక్రమ నిర్మాణాలను ఎవరు ప్రోత్సాహిస్తున్నారు

**నిద్దురమత్తులో ఉన్నతాధికారులు**





**అంబర్‌పేట,మే 16:**
అంబర్‌పేట బుర్జ్ గల్లి లో ఎటువంటి పర్మిషన్ లేకుండా నాలుగు ఫ్లోర్ వేసి కడుతున్నారు. అధికారులు చూసి చూడనట్టు వివరిస్తున్నారు ఈ భవనంపై జిహెచ్ఎంసి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ అక్రమార్కులతో చేతులు కలిపారు గతంలో కూడా రెండు సార్లు పేపర్లో మరియు ట్విట్టర్ లో వచ్చింది.అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.ఈ బిల్డింగు అసలు పర్మిషన్ లేదు. డిప్యూటీ కమీషనర్ మారుతి దివాకర్,టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి సెక్షన్ ఆఫీసర్ సత్య వర్ధన్ ఎవరు కూడా యాక్షన్ తీసుకోవడం లేదు ఎందుకు?. అధికారులే ఈ బిల్డింగు కలర్ వేయించి వైట్ పెయింట్ వేయించారు గత నాలుగు నెలల నుంచి పేపర్ లో వస్తుంది ఎవరు కూడా పట్టించుకోవడం లేదు అంటే అర్థం అవినీతి జరుగుతుంది.జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు.ఈ అధికారులు ప్రతినెల జీతం తీసుకుంటున్నారు కానీ జిహెచ్ఎంసి కి వచ్చే ఆదాయాన్ని వీళ్ళు నిర్లక్ష్యం చేస్తూ అక్రమ నిర్మాణదారుడైన బిల్డింగ్ సహకరిస్తున్నారు.ఈ బిల్డింగ్ వెంటనే సీజ్ చేయాలి జిహెచ్ఎంసి కి వచ్చే ఆదాయానికి డబ్బు కట్టాలి.ఇట్లా అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్నారు ఇది మంచి పద్ధతి కాదు సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి కదా ప్రభుత్వం నడవాలంటే జిహెచ్ఎంసి ఆదాయానికి డబ్బు కట్టాల్సిందే లేని యెడల బిల్డింగ్ ని సీజ్ చేయండి.

## పాకిస్థాన్‌కు భారత సైన్యాధిపతి ఘాటు హెచ్చరిక

**ఉగ్రవాదానికి మద్దతిస్తే పరిణామాలు తీవ్రం**

**దేశ భవిష్యత్తును పాక్ తానే నిర్ణయించుకోవాలి**

**ఉగ్రవాదంపై రాజీ ఉండదన్న భారత వైఖరి**




**న్యూఢిల్లీ, మే 16**
పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతు కొనసాగించి వారిని భారత్‌పైకి ప్రేరేపిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది ఘాటుగా హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం కొనసాగిస్తే ప్రపంచ చరిత్రలో పాకిస్థాన్‌కు స్థానం ఉండాలా లేదా అన్నది ఆ దేశమే నిర్ణయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని మానేక్‌షా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకి సిద్ధంగా ఉండదని, ఉగ్రవాదాన్ని కఠినంగా ఎదుర్కొంటూనే ఉంటామని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా గతంలో చేపట్టిన “సింధూర్ ఆపరేషన్” తరహా పరిస్థితులు మళ్లీ ఏర్పడితే భారత వైఖరి ఎలా ఉంటుందని ప్రశ్నించగా, దీనికి సమాధానంగా ఆయన పాకిస్థాన్‌కు నేరుగా హెచ్చరికలు జారీ చేశారు. దేశ భద్రతకు ముప్పు ఏర్పడితే తగిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రవాద కార్యకలాపాలు ప్రోత్సహించే శక్తులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఆయన స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అవసరమైన ప్రతి చర్య చేపడతామని వెల్లడించారు.గత ఏడాది మే ఏడో తేదీన భారత దళాలు “సింధూర్ ఆపరేషన్” చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై లక్ష్యబద్ధంగా దాడులు నిర్వహించి వాటిని ధ్వంసం చేశాయి. ఆ తర్వాత పాకిస్థాన్ ప్రతిదాడులకు ప్రయత్నించినప్పటికీ భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. దాదాపు ఎనభై ఎనిమిది గంటల పాటు ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగగా, అనంతరం మే పదో తేదీన కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది.

## వైద్య రంగంలో స్వదేశీ ఆవిష్కరణలకు ప్రోత్సాహం

**వైద్య సాంకేతికతపై ప్రత్యేక దృష్టి**

**ఆరోగ్య రంగ సంస్కరణలపై కీలక వ్యాఖ్యలు**

**ఘనంగా నిర్వహించిన పట్టాభిషేక వేడుకలు**

**న్యూఢిల్లీ, మే 16** కేరళలోని తిరువనంతపురం శ్రీ చిత్ర తిరునాళ్ వైద్య విజ్ఞాన, సాంకేతిక సంస్థ నలభై రెండో బ్యాచ్ వార్షిక పట్టాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వర్చువల్ విధానంలో హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ కూడా పాల్గొన్నారు. వైద్య పరికరాల తయారీలో స్వదేశీ ఆవిష్కరణలు, తక్కువ వ్యయంతో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయడంలో ఈ సంస్థ కీలకపాత్ర పోషిస్తోందని జితేంద్ర సింగ్ ప్రశంసించారు. పరిశోధనలను పరిశ్రమలకు అనుసంధానం చేసి సాంకేతికత బదిలీలో కూడా సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.దేశంలో ఆరోగ్య సేవలను మరింత ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. ఆరోగ్య సంరక్షణలో సమగ్ర విధానాన్ని అనుసరిస్తూ సంక్షేమం ఆధారిత వైద్య సేవలు, డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. వైద్య పరికరాలు, సాధారణ ఔషధాల రంగంలో పరిశోధనలకు ఊతమిచ్చేలా పలు నియంత్రణ సంస్కరణలు చేపడుతున్నట్లు పుణ్య సలిలా శ్రీవాస్తవ పేర్కొన్నారు. పరిశోధన ప్రక్రియలను సులభతరం చేసి వైద్య రంగంలో ఆవిష్కరణలకు మరింత అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.ఇంజినీర్లు, వైద్యులు కలిసి పనిచేస్తూ వైద్య పరికరాల తయారీలో కొత్త ఆవిష్కరణలు తీసుకురావడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో విద్యార్థులు నైతిక విలువలు, మానవత్వం, శాస్త్రీయ దృక్పథాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ఈ పట్టాభిషేక కార్యక్రమంలో మొత్తం 130 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో పట్టాలు అందుకున్నారు. అత్యున్నత వైద్య విద్య, ప్రజారోగ్యం, పరిశోధన, న్యూరో విజ్ఞాన శాస్త్ర విభాగాలకు సంబంధించిన పలు కోర్సుల విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నిర్వాహకులు తెలిపారు.



# వైభవోపేతంగా శని జయంతిన కాలభైరవ క్షేత్రంలో యజ్ఞ హోమం

## పోటెత్తిన భక్తజనం



కాలభైరవ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు భైరవ క్షేత్ర నిర్వాహకులు

**హుస్నాబాద్ మే 16**

మండలంలోని ఉమ్మాపూర్ భైరవ గుట్టల్లో కొలువై ఉన్న త్రిపుర భైరవి సమేత కాలభైరవ స్వామి సన్నిధిలో శని జయంతి అమావాస్య తిథిని పురస్కరించుకొని శనివారం రోజున క్షేత్ర నిర్వాహకులు బ్రహ్మశ్రీ శ్రీకాంత్ ఆచార్య ఆధ్వర్యంలో త్రికోణ హోమగుండ యజ్ఞ క్రతువులు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తజనం పోటెత్తింది. ఇందులో భాగంగా నవగ్రహ, అష్టదిక్పాలక, పంచ బ్రహ్మల ఆవాహనతో అంగరంగ వైభవోపేతంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భైరవ క్షేత్ర నిర్వాహకులు శ్రీకాంత్ ఆచార్య మాట్లాడుతూ ఈ కాలభైరవ క్షేత్రంలో అమావాస్య, పౌర్ణమి, అష్టమి విశిష్ట తిథుల్లో ప్రత్యేక పూజలతో పాటు యజ్ఞ హోమ క్రతవులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిలిస్తే పలికే భైరవ స్వామిగా భక్తుల కొంగుబంగారమై దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఈ క్షేత్రానికి భక్తులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి శ్రీకాంత్ ఆచార్య విజ్ఞప్తి చేశారు. పరిసర ప్రాంతాలను అభివృద్ధిపరిచే ప్రభుత్వం త్రిపుర భైరవి సమేత కాలభైరవ స్వామి వారి క్షేత్రాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు.కాగా కార్యక్రమానికి శ్రీమత్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఫౌండర్, చైర్మన్, ప్రధాన అర్చకులు, కార్యనిర్వాహకులు బ్రహ్మశ్రీ కందారపు రమేశాచార్యులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇందులో పరిసర ప్రాంతాల, పరిసర గ్రామాల భక్తులు హాజరై యజ్ఞ హోమ క్రతువుల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

# సన్న వరిసాగుపై కలెక్టర్ ఫోకస్

## జనగణనపై గ్రామాల వరకూ అవగాహన : జిల్లా కలెక్టర్ హైమావతి



రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్, మే16**

సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం హుస్నాబాద్, అక్కన్నపేట ప్రాంతాల్లో పర్యటిస్తూ ధాన్యం దిగుమతులు, రహదారి నిర్మాణ పనులు, జనగణన అవగాహన కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా మార్కెట్ యార్డులు, రైస్ మిల్లుల్లో వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్‌లో రైతులు సన్న వరిసాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హుస్నాబాద్--కొత్తపల్లి మధ్య రూ.77.20 కోట్లతో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి పనులను పరిశీలించి, నాణ్యతతో పాటు గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అక్కన్నపేటలో జనగణన--2027పై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈనెల 11 నుంచి జూన్ 11 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలు సేకరిస్తారని, ప్రజలు సహకరించాలని కోరారు.

# కేటీఆర్‌ను కలిసిన విద్యార్థి సంఘాల నేతలు

**నీట్ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం**

**పరీక్ష పత్రాల లీకేజీలపై ఆందోళన**

**కేటీఆర్‌కు సమావేశ ఆహ్వానం**

**హైదరాబాద్, మే 16**

నందినగర్‌లోని నివాసంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లెఫ్ట్ విద్యార్థి సంఘాల నేతలు కలిశారు. బీఆర్ఎస్వీ నాయకుడు డాక్టర్ తుంగ బాలు సమన్వయంతో ఈ సమావేశం జరిగినట్లు సమాచారం. విద్యార్థులకు సంబంధించిన కీలక అంశాలు, పోటీ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్ష పత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని విద్యార్థి సంఘాల నేతలు పేర్కొన్నట్లు సమాచారం. పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విశ్వసనీయత అత్యంత కీలకమని, కానీ వరుసగా పరీక్ష పత్రాల లీకేజీలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని నేతలు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వైద్య విద్యకు సంబంధించిన ప్రతిష్టాత్మక పరీక్షల విషయంలో ఇలాంటి ఘటనలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం దెబ్బతినే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాలు అభిప్రాయపడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ నెల ఇరవై తేదీన హైదరాబాద్‌లో లెఫ్ట్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీ పరీక్షల నిర్వహణ, విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షా విధానాల్లో మార్పులు వంటి అంశాలపై చర్చ జరపనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి హాజరుకావాలని కోరుతూ కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించినట్లు విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన అంశాల్లో అన్ని వర్గాలు కలిసి చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో ఏర్పడుతున్న అనిశ్చితి తొలగించేందుకు సమిష్టి చర్యలు అవసరమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నట్లు తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరినట్లు సమాచారం.



# బండి సంజయ్ తొలగింపుపై కవిత డిమాండ్

**- ప్రధానమంత్రి మోదీకి లేఖ పంపింపు - విచారణపై ప్రభావం ఉండొద్దన్న అభిప్రాయం**

**నిష్పక్షపాత దర్యాప్తు జరగాలన్న విజ్ఞప్తి**

**హైదరాబాద్, మే 16** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసి పలు అంశాలను ప్రస్తావించారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో ఈ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్గానికి సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువస్తున్నానని కవిత తన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా చట్ట అమలు వ్యవస్థలతో సంబంధం ఉన్న కీలక శాఖలో కొనసాగుతున్న వ్యక్తిపై ఇలాంటి వివాదం నెలకొనడం ఆందోళన కలిగిస్తోందని అభిప్రాయపడ్డారు. హోంశాఖ వంటి కీలక విభాగంలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన కేసులో దర్యాప్తు పూర్తిగా స్వతంత్రంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కోరారు.న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలంటే ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని కవిత అభిప్రాయపడ్డారు. విచారణ ప్రక్రియ పూర్తిగా స్వేచ్ఛగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తప్పించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. దీనివల్ల మైనర్ల భద్రత, న్యాయ వ్యవస్థకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశం ప్రజల్లోకి వెళుతుందని పేర్కొన్నారు. కాగా, పదిహేడేళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల ఎనిమిదో తేదీన భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహితతో పాటు పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# విద్యార్థిని వేధింపుల కేసులో ప్రొఫెసర్ అరెస్ట్

**పరీక్ష పత్రాల పేరుతో వేధింపుల ఆరోపణ**

**ఆడియో ఆధారాలతో యాజమాన్యానికి ఫిర్యాదు**

**దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**లక్నో, మే 16**

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఓ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై విద్యార్థిని వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. పరీక్ష పత్రాలు లీక్ చేసి తెచ్చానంటూ తనను కలవాలని ఒత్తిడి చేశాడని ఓ విద్యార్థిని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం లక్నో విశ్వవిద్యాలయంలో జంతుశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పరమ్‌జిత్ సింగ్ ఓ బీఎస్సీ విద్యార్థినికి ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. ఫోన్ సంభాషణలో అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు పరీక్ష పత్రాలు తెచ్చానని చెప్పి తనను కలవాలని కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యార్థిని తెలిపిన వివరాల ప్రకారం తాను పరీక్షలకు సిద్ధమయ్యానని, సిలబస్ పూర్తి చేశానని చెప్పినా ప్రొఫెసర్ పదేపదే కలవాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం. పరీక్షలకు ముందే తనను కలవాలని కోరినట్లు ఆరోపించారు.ఈ వ్యవహారంపై అనుమానం వచ్చిన విద్యార్థిని ఫోన్ సంభాషణలను రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. అనంతరం రెండు ఆడియో క్లిప్‌లను విశ్వవిద్యాలయ యాజమాన్యానికి సమర్పిస్తూ తనను లైంగికంగా వేధించే ఉద్దేశంతోనే పిలిచినట్లు ఫిర్యాదు చేసింది. ఈ విషయం బయటకు రావడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో యూనివర్సిటీ యాజమాన్యం దర్యాప్తు కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. అదే సమయంలో పోలీసులకు ఫిర్యాదు అందడంతో పరమ్‌జిత్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరోవైపు తనపై వచ్చిన ఆరోపణలను ప్రొఫెసర్ ఖండించారు. విశ్వవిద్యాలయంలో అంతర్గత రాజకీయాల కారణంగానే తనను తప్పుడు కేసులో ఇరికించారని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనకు సంబంధించిన ఆడియో క్లిప్‌లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# కల్వల ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు కోరుతూ వినతి


**ప్రాజెక్టు పునరుద్ధరణకు విజ్ఞప్తి**

**రైతులకు సాగునీటి సౌకర్యాల మెరుగుదల**

**ఎనిమిది వేల ఎకరాలకు ప్రయోజనం**

**హైదరాబాద్, మే 16**

హుజూరాబాద్ నియోజకవర్గ రైతుల ప్రయోజనాల కోసం మరో కీలక అడుగు పడింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని హైదరాబాద్ సచివాలయంలో కలిసి శంకరపట్నం మండలం కల్వల గ్రామంలోని కల్వల ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మత్తుల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కల్వల ప్రాజెక్టు పనుల కోసం సుమారు డెబ్బై కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి వద్ద వినతిపత్రం సమర్పించారు. ప్రాజెక్టు పునరుద్ధరణతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరనున్నాయని వివరించినట్లు సమాచారం. శంకరపట్నం, వీణవంక, జమ్మికుంట మండలాల్లో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఈ ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్నారని కౌశిక్ రెడ్డి పేర్కొన్నట్లు తెలిసింది. ప్రాజెక్టు అభివృద్ధి ద్వారా సాగునీటి సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.ప్రస్తుతం ప్రాజెక్టు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపడితే సాగునీటి సరఫరా సామర్థ్యం పెరుగుతుందని, రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు ఇది శాశ్వత పరిష్కారంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. కల్వల ప్రాజెక్టు అభివృద్ధి పూర్తయితే దాదాపు ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టు ప్రాంతానికి ప్రయోజనం చేకూరనున్నట్లు వెల్లడించారు. రైతుల ఉత్పాదకత పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి కూడా ఊతం లభిస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి కొనసాగిస్తామని కౌశిక్ రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.





## ఒకే నెలలో మూడు సినిమాలు..
# కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

# హైప్ పెంచుతున్న మాస్టర్ మహేంద్రన్ వసుదేవసుతం టీజర్



దేవి సినిమాతో చైల్డ్ యాక్టర్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు మాస్టర్ మహేంద్రన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న చిత్రం వసుదేవసుతం. వైకుంఠ్ బోను డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ యాక్టర్ సత్యదేవ్ ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఈ కథ ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా.. లక్షల బంధుగణమైనా.. ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు.. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదురెళ్లే యువకుడిది అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గుడి, గుప్త నిధి చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగన్నుట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్‌గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్, అంబికావాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలువబోతున్నట్టు టీజర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు.



# అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

# ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.

